**పాపం, పుణ్యం, ప్రపంచ మార్గం తెలీని ప్రాయంలో దారితప్పిన తమ్ముడు తరువాత అందుకున్న ఫలితం యేమిటి? ప్రేమించే మనసులో బెదురు! వాస్తవ జీవితం వేసిన కఠినశిక్ష! అటూ ఇటూ హృదయాల్లో యెడతెరపి లేని కన్నీటిముసురు!**



గుమ్మా ప్రసన్నకుమార్

'వచ్చే స్టేషను బొబ్బిలేనా?'

"అదేటది? బొబ్బిలి కామ?"

శివరావు లేచి నిల్చున్నాడు. కాళ్ళల్లో వణుకు ప్రారంభమయింది. గుండెలో బరువు చోటు చేసుకుంది. వళ్ళంతా నిస్సత్తువ ఆవరించింది. తిమ్మిరెక్కిన మనిషిలా స్తబ్దుగా నిల్చున్నాడు.

చీకటిని చీల్చుకుంటూ పోతున్న రైలు వేగం తగ్గింది. కంపార్ట్‌మెంటు గుమ్మం దగ్గరగా నిల్చున్నాడు శివరావు. చినుకులు మొహంమీద పడుతున్నాయ్.

ఫ్యాక్టరీ. కోటి చెరువూ, ఆసీలు మెట్టా వెనక్కి జారిపోయాయి. రైలు బొబ్బిలి ప్లాటుఫారంమీద ఆగింది. వర్షపు జల్లు మొహానికి కొడుతుంటే జనాన్ని తోసుకుంటూ తడబడే అడుగులతో కిందకు దిగాడు శివరావు.

పదిహేనేళ్ళ క్రితం—

ప్లాటుఫారం పూర్తిగా కప్పుతూ, ఇప్పుడున్న షెడ్ లేదు ఇప్పుడున్న ఓవర్ బ్రిడ్జి లేదు. కాలం తెచ్చిన మార్పుకి శివరావు మనసు ఒక్కసారి ఆశ్చర్యపోయింది. 'తను బొబ్బిలే వచ్చాడా?' ఎదురుగా తాటికాయంత అక్షరాలతో ఉన్న బోర్డు - ఊపిరి పీల్చుకున్నాడు.

టికెట్టిచ్చి బయటపడ్డాడు. ఈదురు గాలి వీస్తోంది. చిన్నచిన్న తుంపరలు పడ్తున్నాయ్ గూడ్స్ షెడ్ పక్కనుంచి నడిచాడు. గూడ్స్‌షెడ్ ఆ చీకట్లో ముడుచుకు పడుకున్న ముసలమ్మలా ఉంది. ఇష్టంలేని పాత స్నేహితుడ్ని చూసినట్టు చీకట్లో కలిసిపోయింది.

ఆరేళ్ళ వయసుకే రోజు వచ్చేవాడు శివరావు ఇక్కడికి. కాపలావాళ్ళకి తెలియకుండా ఏదో ఒకటి చేజిక్కించుకునేవాడు. దొరికిననాడు తప్పకుండా హోటల్‌కి వెళ్ళేవాడు. సిగరెట్ తాగేవాడు. మంచేదో, చెడేదో తెలియని రోజులవి. భగవంతుడనేవాడుంటే తనని చాలా అన్యాయం చేశాడు. లేకపోతే తన బతుకీరోజు ఇలా వుండేదికాదు. ముప్ఫై ఐదేళ్ళ వయసుకే మరొకరిమీద ఆధారపడి బతకవలసిన రోజు దగ్గరకు వచ్చేసిందని తెలిసిపోయింది శివరావుకి.

అలా జరుగుతుందని తెలిస్తే తన బతుకుని మరో విధంగా తిప్పుకునేవాడేమో! అందుకే దేవుడ్ని తిడుతుంటాడు శివరావు. మనిషి తప్పుమార్గాన పోతుంటే వాడికి

సరియైన దారి చూపించి నడపడం దేవుడి బాధ్యత కాదా? నిట్టూర్చాడు శివరావు.

ఎనిమిదేళ్ళ వయసుకే శివరావు కొంత చొరవ అలవర్చుకున్నాడు. చోర విద్యలో ఒక మెట్టెక్కిపోయాడు. శివరావుకి వచ్చిన విద్యలు చూసి ఆశ్చర్యపోయే వాడు ముసలయ్య. శివరావుకి మంచి భవిష్యత్తున్నదని కూడా అప్పుడప్పుడూ శివరావుతోనే అనేవాడు. ఆ దీవన శివరావులోని విద్య మరింత విజృంభించేట్లు చేసింది. వీరవిహారం చేసేవాడు. శివరావు ముఖ్య కేంద్రాలు. బజారు, స్టేషను, సంత. ఆ మూడింటిలోనూ ఎటువేపు వెళ్ళినా ఓ వారం రోజులకు సరిపడా గ్రాసం తెచ్చుకునేవాడు. పెద్ద వాళ్ళతో వినయ విధేయతలు నటించగలిగే వాడు. దొంగతనం చేస్తూ దొరికిపోయినపుడు. ఇంట్లో దరిద్రం. తలితండ్రుల అసహాయత. చెల్లెళ్ళూ తమ్ముళ్ళూ అమ్మమ్మ ఇంకా ఎందరో ఎలా మాడిపోతున్నారు. ఏ పరిస్థితుల వల్ల తనీ దొంగతవం చేయవలసి వచ్చిందో జాలిగా చెప్పేవాడు. తమది ఒకప్పుడు బాగా బతికిన కుటుంబమని కూడా చెప్పేవాడు. వాళ్ళ సానుభూతిని సంపాదించేవాడు. ఎక్కడా ఏదీ దొరకనప్పుడు ఇంట్లో దొరికింది అమ్మేసుకునే వాడు.

అదంతా తలుచుకుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది శివరావుకి-

టింబరు డిపోల కటూ ఇటూ రావు వారి వీధిలో కట్టిన ఇళ్ళకేసి ఆశ్చర్యంగా చూశాడు శివరావు. పదిహేనేళ్ళక్రితం ఈ ప్రాంతం నిర్జనంగా ఉండేది. రాత్రి ఏడు దాటిన తర్వాత పెద్దవాళ్ళు సైతం ఇటు వచ్చేవారు కారు. అప్పుడు ఎనిమిది తర్వాత తనొక్కడే ఇటువేపు వచ్చేవాడు. తన ధైర్యానికి విస్తుపోయిన ముసలయ్య వంక చూస్తూ సిగ్గుపడిపోయి, ఆనంద పడేవాడు శివరావు.

తుంపరలుగా పడుతున్న వర్షం కొద్దిగా పెద్దదైంది దానితో పాటుగా వీస్తోన్న ఈదురుగాలి. వర్షం ఇంకా ఎక్కువైనట్లుగా భ్రమింపజేస్తోంది. శివరావు వీటన్నిటికీ అతీతమైపోయినట్లు చిన్నగా. నిర్వికారంగా నడుస్తున్నాడు.

అమ్మ రోజూ మొత్తుకునేది. కళ్ళనీళ్ళు పెట్టుకునేది. తను దొంగతనంచేసి దొరికిపోయి, దెబ్బలుతిని వచ్చినరోజున తనను కౌగలించుకుని బావురుమనేది. ఒక్కరోజుకూడా తనని తిట్టేదికాదు. కొట్టేది కాదు. కళ్ళనీళ్ళతో ప్రాధేయపడేది. ఇలాంటి పనులు చేసిన మామయ్యని

సంప్రదాయ మాధురి

## మందార మకరందాలు

శ్లో॥ విద్యయా వినయూ వాప్తిః। సా చే దవినయావహా।
కిం కుర్మః కం ప్రతిబ్రూమో। గరదాయాం స్వమాతరి॥

విద్యవలన వినయము రావాలి. అట్లాగాక విద్యవలన అవినయమే అబ్బితే యేం చెయ్యాలి? ఏది దారి? తల్లే విషం పెడితే ఎవరితో చెప్పుకునేది?

దండించినఫలితంగా అతను కొన్నిరోజులు ఇల్లు విడిచి పారిపోయాడట. కొన్నాళ్ళ వరకూ అతని జాడకోసం మామయ్య తల్లి దండ్రులు పడ్డ అవస్థ అంతా, ఇంతా కాదుట. చివరకు ఎంతో డబ్బు ఖర్చుచేసి ఇంకెంతో శ్రమపడిన మీదట అతను దొరికాడట. ఈ సంగతి ఎప్పుడో మాటల సందర్భంలో శివరావు విన్నాడు. అందుకే అమ్మ తనను కొట్టడం లేదని కొన్ని రోజుల తర్వాత నిర్ధారించుకున్నాడు.

నాన్న ఏమీ అనేవాడు కాడు. ఎప్పుడూ ఉబ్బసరోగం. చలికాలం, వర్షాకాలంలో తరచు పనిలోకి వెళ్ళేవాడుకాడు. రోజంతా కంబళి కప్పుకుని పడుకునేవాడు. ఎండలోనే ఉండేవాడు. తను కాక. అక్క ముగ్గురు చెల్లెళ్ళు. ఇద్దరు తమ్ముళ్ళు. అక్కకి పెళ్ళయింది. అయిన మరుసటి సంవత్సరం నుంచీ ఇంట్లోనే వుండిపోయేది. కొత్తలో అమ్మ అక్క దౌర్భాగ్యానికి రోజూ ఏడ్చేది - బావ చచ్చిపోయాడు. అకస్మాత్తుగా.

వర్షం కొద్దిగా నిల్చినట్లయి, మళ్ళీ మొదలైంది. తనకు బాగా పరిచయమున్న ఇళ్ళు కొంచెం పొట్టి వయ్యా యనుకున్నాడు. శివరావు పొడు గెదిగాడు. గోడల మీద పోస్టర్లబట్టి వూర్లో మూడు సినిమా హాళ్ళున్నట్లు తెలుసుకున్నాడు. కాలేజీలు, ట్యుటోరియల్ కాలేజీలు, హోటళ్ళు రక



రకాలవి వెలిసినట్టు గోడలమీద నినాదాల బస్ చూహించుకున్నాడు.

బస్సు స్టాండు దాటేడు చలిగా ఉంది. బాగా తడిసిపోయాడు శివరావు. బహుశా రేపటెల్లుండిలో తప్పకుండా తనకు జ్వరం వచ్చేస్తుంది. తరచు జైలు జీవితం శివరావు శరీర తత్వాన్ని పూర్తిగా మార్చేసింది. ఈ నాలుగైదేళ్ళలో శివరావు ఆరోగ్యం మరికొంచెం దిగజారిపోయింది. కీళ్ళ నొప్పులు. సీజను మారినా నీళ్ళు మారినా జ్వరం రావడం జరుగుతోంది. అక్కడక్కడా శరీరం కొంచెం పొంగినట్టుగాఉంటోంది అది ఈమధ్యనే గమనించాడు శివరావు ఏం రోగమో శివరావుకి బోధ పడలేదు

చారల వీధి మొగలో ఆగాడు. గోపాలం కొట్టు అక్కడే వుంది. పరీక్షగా చూశాడు. గోపాలమే కూర్చున్నాడు దుకాణంలో.

"చార్మినార్ సిగరెట్" అన్నాడు శివరావు పొడిగా.

"ఏటి? పెట్టిచ్చిమంటారేటి?" అన్నాడు గోపాలం.

"లేదు సిగరెట్."

సిగరెట్టు వెలిగించి కాస్సేపు అక్కడే నిల్చున్నాడు. ఆ వీధిలో తను కుటుంబం గురించి అడుగుదామా, వద్దా అని సంశయించాడు. చిన్నప్పటినుండీ గోపాలానికి తను కుటుంబం గుర్తే. తన ఈ అవతారం గోపాలానికి గుర్తుండి వుండదు. చిన్నగా దగ్గి అడిగాడు.

"....వారి కుటుంబం ఇక్కడేవుందా?"

"ఎవరూ?..వాళ్ళా..ఇక్కడే ఉన్నారు" అన్నాడు గోపాలం.

"మందేపూరు?" అన్నాడు మళ్ళీ.

శివరావు ఏదో చెప్పాడు అతని వేళ్ళు వణుకుతున్నాయి. అక్కడ నిలబడలేక పోయాడు. చూరులోంచి బయటకు వచ్చి మళ్ళీ వర్షంలో కలిసిపోయాడు. కరెంటు పోయినట్టుంది. రోడ్డంతా దీపాలులేవు. ఆ వీధిలో తనకు తెలిసిన ఇళ్ళ తాలూకూ ఆసాములందర్నీ ఒక్కసారి గుర్తుకు తెచ్చుకున్నాడు.

అదిగో ఆ టర్నింగులో ఇల్లుంది. శివరావు ఆగిపోయాడు. గుండె లిప్తకాలం ఆగిపోయింది. ఒక్కొక్క అడుగే వేస్తూ ఇల్లు చేరుకున్నాడు. ఇల్లు కొంచెం క్రుంగిపోయినట్టుంది శివరావు కుటుంబానికి పూర్వీకులు మిగిల్చిపోయిన ఆస్తి ఇదొక్కటే. ఇంట్లో ఎవరున్నారో ఎందరు మిగిలారో ఎవరి పేరుతో తలుపు తట్టడమో....

నిస్సత్తువతో ఆ తడిలోనే అరుగుమీద కొంత సేపు కూర్చున్నాడు. పది నిమిషాలు పోయిన తర్వాత అదురుతున్న గుండెతో తలుపు కొట్టాడు. అలా రెండు నిమిషాలు కొట్టిన మీదట ఆడగొంతు వినిపించింది. "ఎవరూ?"

ఆ గొంతుకను శివరావు పోల్చుకోలేక పోయాడు. నేనేనని చెప్పడానికి గొంతు కూడా విడలేదు. మరుక్షణంలో తలుపు తీసిన శబ్దమయి ఒక్కడుగు వెనక్కి వేశాడు.

లాంతరు కొంచెం పైకెత్తి శివరావు మొహం చూడ్డానికి ప్రయత్నిస్తున్నట్టుగా కళ్ళు చికిలించి చూస్తూ అంది ఆమె. "ఎవరూ? ఎవరు కావాలి?"

శివరావు మాట్లాడలేదు గొంతుని ఎవరో నొక్కుతున్నట్టనిపించింది. ఒంట్లో వున్న నీరంతా కన్నీళ్ళ రూపంలో బయటకుదూకడానికి సిద్ధంగా ఉన్నట్టున్నాయి అతని చూపులు.

ఆ లాంతరువెలుగులో అక్కని పోల్చుకున్నాడు.

"అక్కా" అనగలిగాడు శివరావు చివరకు.

"ఎవరూ?" అంది శాంతి, లాంతరు శివరావు మొహానికి తగిలిస్తున్నట్టుగా. శాంతి అతన్ని పోల్చుకోడానికి ప్రయత్నిస్తోంది.

"నేనక్కా"

"శివా?" అంది శాంతి ఆశ్చర్యంగా.


అవునన్నట్టు తలూపాడు శివరావు.

"శివా" అంది మళ్ళీ శాంతి. సన్నని ఏడుపు. కడుపులోంచి కట్టలు తెంచుకు వస్తున్న ఏడుపుని ఆపుకోడానికి అన్నట్టు నోటికడ్డంగా పైట చెరగునుంచింది.

## నిరీక్షణ

ఈ పాతబడిన క్షణాల్ని కోయిల గొంతు
లోనే కలకాలం మిగలనీ
ఎప్పుడన్నా వెనక్కి తిరిగినప్పుడు
ఆ సంగీతాన్ని వెదుక్కొంటాను
నీ సాయంకాలాలు నీకై భద్రంగా
పొందుపరుస్తాను
ఈ ఉదయం నీ హృదయమని మరిచిపోకు
రాబోయే కాలమంతా రవసెల్లాలు పరిచి
అలంకరించాను
నీ ఏకాంతంలో పలకరించినా నేనిక్కడే
ఎదురు చూస్తుంటాను.

—గొల్లపూడి మారుతీరావు



సంక్రాంతి ముగ్గు — పి. లక్ష్మి. పద్మ. విజయవాడ

WHEN NATURE FAILS

మరింత ఎత్తు, పొడుగు కాగలరు

H New Super eight (For Super Heightness 2 నుండి 8 అం. వరకు పూచీ

మీరూ పొడుగు పెరగదలచుకుంటే ప్రపంచ ప్రఖ్యాతి పొందిన మా హైటెక్స HYTEX ఔషధాన్ని వాడండి. వయోపరిమితి లేదు. స్త్రీలు పురుషులు కూడా పుచ్చుకోవచ్చు. HYTEX is a great name and meant for popu-lar people I phail (20 T A B. S) Rs.7-50 advance By M.O. 3 Phails (60 Tabs) Rs. 15/- money order by advance.

M/s London Commercial Coy
Beat No 1, House No 3883 X
Ambalacantt—133001 N. I)
Correspond in English (AJW/12/78

A.J.W 1/79

వార్తలకు, వ్యాఖ్యలకు

"ఆంధ్ర జ్యోతి"

దిన పత్రికనే చదవండి.

గా॥ పి. వి. కె. రావ్. B.A.. సెక్సస్పెషలిస్ట్



వైద్యవిద్వాన్-వైద్యాచార్య హస్తప్రయోగం, నరముల బలహీనత, అంగము చిన్నదగుట, శీఘ్రస్ఖలనము-శుక్లనష్టము, సుఖ రోగములకు మానసిక వ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోష్టు ద్వారా కూడా చికిత్స గలదు.

రావూస్ క్లినిక్,

టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700.

SUVARNA

SEALED PACKING ... TABLETS
AVAILABLE AT ALL CHEMISTS

M/s. SEENU & CO., MADRAS-21




"లోపలికి పద" అన్నాడు శివరావు గుమ్మంలో కాలుపెడుతూ

ఏడుపులోనే దారి చూపెడుతూ లోపలికి తీసుకెళ్ళింది శాంతి. మంచంమీద కూర్చున్నాడు శివరావు లాంతరు కొక్కానికి తగిలించి శాంతి కింద కూర్చుంది రెండు చేతులతో మొహం కప్పుకుని. అక్క ఏడుపుని ఆపే ప్రయత్నమేమీ చేయలేకపోయాడు శివరావు. చుట్టూ చూశాడు. ఓ మూల ఇద్దరాడవాళ్ళు పడుకున్నారు. మంచంమీద ఇంకొకామె పడుకుని వుంది. వాళ్ళు ముగ్గురు తన చెల్లెళ్ళై వుండవచ్చు ననుకున్నాడు-తమ్ముళ్ళేరీ? అమ్మ ఏదీ? నాన్న ఏరీ? అన్నీ అడుగుదామనుకున్నాడు.

"అమ్మేది అక్కా" అన్నాడు శివరావు.

అప్పటికి ఏడుపుని ఆపుకుని నిర్వికారంగా కిందికే చూస్తున్న అక్కలో మళ్ళీ కదలిక వచ్చింది. దుఃఖం ముంచుకొచ్చింది ఆమెకు. ఈ సారి అమ్మలేని కొరత తీరిపోయేలా ఏడుపు ప్రారంభించింది. అప్పటికి తక్కిన ముగ్గురు లేచి కూర్చున్నారు.

వాళ్ళకేమీ అర్థం కాలేదు-కావడంలేదు. నిద్రమత్తు వదలినట్లుగా వెర్రి వాళ్ళలా చూస్తూ కూర్చున్నారు.

"అమ్మేది లక్ష్మి" ఆ ముగ్గురిలో ఎవరు లక్ష్మో తెలియక పోయినా అడిగాడు శివరావు.

"ఎవరమ్మ.... మా అమ్మ? చచ్చిపోయింది. నాన్న పోయిన మూడు నెల్లకే పోయింది" అక్క ఎందుకేడుస్తూందో మిగిలిన వాళ్ళకి బోధపడింది. అందరి కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"తమ్ముడో?"

"ఎవరు? వాసా?....వాసుకోసం ఆర్నెల్లు వెతికి వూరుకున్నాం" అంది లక్ష్మి. "రాఘవ సినిమా హాల్లో పనిచేస్తున్నాడు. మూడు గంటల రాత్రికి వస్తాడు" అంది లక్ష్మి మళ్ళీ.

ఇంకా ఆశ్చర్యంగా చూస్తున్న మూడో చెల్లి నుద్దేశించి అంది శాంతి గద్గదంగా. "అన్నయ్యే.... శివ."

శివరావు తల వంచుకున్నాడు. చెల్లెళ్ళి పలకరింపుగా చూడ్డానికికూడా సిగ్గేసింది శివరావుకి.

"అవున్రా.... ఇన్నాళ్ళూ ఎక్కడున్నావురా?" అడిగింది పెద్ద చెల్లి నిష్ఠూరంగా.

"మీకింకా పెళ్ళిళ్ళు కాలేదా?" అని అడుగుదామనుకుని మానేశాడు శివరావు. ఈ లోపల ఈ ప్రశ్న వేసింది పెద్ద చెల్లి. చిన్నగా దగ్గి వూర్కున్నాడు శివరావు సమాధానం చెప్పలేదు. బయట కుండపోతగా వర్షం కురుస్తోంది. చివరికి శాంతి పెద్దగా నిట్టూరుస్తూ లేచింది. "భోజనం తయారు చేస్తాను"

శివరావు వద్దనలేదు. ఆకలి కూడాలేదు.

"అవున్రా ఇన్నాళ్ళూ ఎక్కడున్నావురా?., మేము జ్ఞాపకానికి రాలేదుట్రా?" అని అడిగింది పెద్ద చెల్లి. ఇదెప్పుడేనా, పెద్దదయి బాగా మాట్లాడుతుందా అని అనిపించేది చిన్నప్పుడు. పెద్దా చిన్నా అనే భేదం లేకుండా మాట్లాడుతుందేది. అప్పుడు అలాటిపిల్ల తననిలా ప్రశ్న

స్తుంటే ఆమెవైపు ఆశ్చర్యంగా చూశాడు శివరావు మాట్లాడలేదు.

పెద్దచెల్లి మరి రెట్టించి అడగనూ లేదు. చనువు చూపి అన్నయ్యను పలకరించినా సమాధానం రాకపోయేసరికి చిన్నబోయింది. ఉన్నచోటనే గోడకి చేరగిలబడి కూర్చుంది మిగిలిన ఇద్దరూ తిరిగి పడుకునే ప్రయత్నంలో వున్నారు.

"బయట నీళ్ళు పెట్టేను.... కాళ్ళు కడుక్కో" లోపలినుంచి పలికింది శాంతి.

శివరావు కొంతసేపలానే కూర్చుని లేచేడు - భోజనం అయిందనిపించాడు. భోజన సమయంలో ఎవరూ మాట్లాడలేదు. శాంతి తప్ప మిగిలిన ముగ్గురు చెల్లెళ్ళు నిద్రపోతున్నారు

శివరావు చుట్టూ చూశాడు. ఇంట్లో వున్న వస్తువులేవీ తనని ఆహ్వానించి నెలల తరబడి భరించి తిండి పెట్టేట్లులేవు. ఇందాక ఎక్కడ కూర్చున్నాడో అక్కడే చతికిలపడ్డాడు.

చెయ్యి తుడుచుకుంటూ వచ్చింది శాంతి. లాంతరువత్తి తగ్గించింది. గుమ్మానికి చేరగిలబడి వర్షాన్ని చూస్తూ నిల్చుంది.

"నీ కోసం ఎంతో వెదికాం. వెతికించాం. నాన్న ఆ బెంగతోనే పోయారు. ఏ రాత్రేనా తలుపు చప్పుడయితే నువ్వేనేమోనని ఆత్రుత పడేవాళ్ళం. నాన్నని, అమ్మని చిత్రవధ చేశావ్."

శివరావు మాట్లాడలేదు. చిన్నగా దగ్గి సర్దుకుని కూర్చున్నాడు.

"ఆ రాత్రి వర్షం పడుతోంది. ముసలయ్యతో వెళ్ళాను" పాత సంఘటనలను జ్ఞాపకం చేసుకోడానికన్నట్లుగా ఓ రెండు నిముషాలాగాడు. శాంతక్క చూపు ఇంకా వర్షం మీదే వుంది. "ముసలయ్య దొరికిపోయాడు. ముసలయ్య చెప్పేవాడు. 'ఇలాంటి' దొంగతనాలు చేస్తూ దొరికిపోయారంటే గటి శిక్ష పడుతుందని. దొరికిపోయుంటే నాగతేమిటో నాకా క్షణంలో తెలిసిపోయింది. దొంగతనం...."

ఏదో ఆలోచన రాగా శాంతి ఉలిక్కిపడింది ఆందోళనతో శివరావుని చూసింది.

"ఈ ఊర్లో వుండే ధైర్యం లేకపోయింది. ముసలయ్య చెప్పేవాడు బొంబాయి నగరం చాలా మందికి అనువైనదని." ఆగిపోయాడు శివరావు.

శాంతి భయంగా చూసింది శివరావు వేపు తర్వాత ఆమె చూపు మంచంక్రింద నున్న చెక్కపెట్టెమీదకు మళ్ళింది. అందులో చెమటని చవిచూసిన ఎనభై పాయలున్నాయి పైసా పైసా కూడబెట్టగా అయిన రూపాయలవి. ఉన్న

అడ్రసు మార్పు బందరురోడ్డునుండి హోటల్ నటరాజ్ ఎదురుగా మార్చబడినది

నీలిమ ఎంటర్ ప్రైజెస్

(హౌస్ ఆఫ్ గ్లాస్ వేర్ & క్రాకరీ)

హోటల్ నటరాజ్ ఎదుట * కాళేశ్వరరావురోడ్డు

విజయవాడ.2

అధునాతనమైన డిజైనులతో మన్నికయిన వాటర్ గ్లాసులు, కటగ్లాసులు, క్రిష్టల్ గ్లాసులు, ఫ్లవర్ వాజులు, యాష్ ట్రేలు, డిన్నర్ సెట్లు, HITKARI POTTERIES పింగాణీ సామాన్లు, టీసెట్లు, కాఫీ కప్పులు, సాసర్లు మరియు ప్రజెంటేషన్ ఆర్టికల్సుకు మా ప్రత్యేకత




చక్కటి అవకాశం ది 1-12-78 నుండి త్వరపడండి

VIMAL
A RELIANCE PRODUCT

రు. 15000 ల

విలువైన 400 ల బహుమతులు


కనులకు విందు కంటికి యింపు

చూడముచ్చట గొలిపే

విమల్ వారి 100% పోలిష్టరు టిష్యూ, పోలిమేడ, ది వైన్ జ్యుయల్, పరికా మరియు యింకా ఎన్నో అందమైన పలురకాల చీరలు విమల్ షోరూం ఆరాధనలో ఖరీదుచేసి ప్రతి 50 రూపాయలకు ఒక బహుమతి కూపను పొందండి.

ఆరాధన విమల్ షోరూం

కొత్తగూడెం.




చోటునె క్రిందికి జారి కూర్చుంది. అంత చలిలోనూ చిరుచెమట పట్టింది "మమ్మల్నిలా బతకనియ్యవా శివా?" అంది శాంతి-ప్రపంచంలోని దైన్యాన్నంతటినీ మొహంలో నింపుకుని.

శివరావు అయోమయంగా చూశాడు శాంతక్కవేపు.

కలలోంచి మేల్కొన్న దానిలా ఒక్కసారి లేచింది శాంతి శివరావు మంచం దగరకు వచ్చింది, అలసటను ఆపుకుంటున్నట్లుగా అంది "కొంచెం కాళ్ళు తియ్య శివా. కింద చెక్క పెట్టె ఉంది. అది లాక్కుని దానిమీద కూర్చుంటాను"

శివరావు సాయం చెయ్యబోయాడు. వద్దని వారించి తనే పెట్టె లాక్కుంది. గదికి ఓ మూలగా లాగి దానిమీద కూర్చుంది. కూర్చున్న తర్వాత తృప్తిగా నిట్టూర్చింది

కొంతసేపలానే కూర్చుని ఏదో నిశ్చయానికొచ్చిన దానిలా అంది శాంతి- "చూడు శివా- నీకెలా చెప్పాలో బోధపడటంలేదు. దరిద్రం నన్నిలా మాట్లాడిస్తోంది. నువ్విప్పుడిక్కడికి రావడంలో ని ఉద్దేశం కూడా బోధపడలేదు చూస్తున్నావు కామా నా పరిస్థితి. నువ్విప్పుడు తిన్నన్నం రాఘవది. వాడీ రాత్రికి మాడాలి."

"చాలక్కా.... చాలు మరి చెప్పకు" అన్నాడు శివరావు అభిమానపడుతూ

అక్క ఆగలేదు. "రాఘవని రోజూ కనిపెట్టుకుని కూర్చోలేక అవస్థపడుతున్నాను. మన కుటుంబానికి ముగ్గురు మొగాళ్ళున్నారు. ఎందుకూ పనికిరాలేదు. ఆడదాని కష్టం వాళ్ళకి తెలీదు నువ్వెళ్ళిపోయావు. తిరిగి వచ్చేస్తే బావుండుననుకున్నాం. కొన్ని రోజులు ఏడిచి ఊరుకున్నాం. తర్వాత నాసుకని బుద్ధులే వచ్చాయి. అమ్మా నాన్నా చచ్చిపోయిన తర్వాత ఇంట్లో ఒక్క వస్తువూ ఉంచేవాడు కాడు. వాడూ నీలాగే వెళ్ళిపోతే చాలనుకున్నాం. ఒకరోజు వాడు కనిపించలేదు. చేయవలసిన ప్రయత్నాలు చేశాం. దొరుకుతాడేమోనని భయమేసింది. మా కళ్ళల్లో నీరులేదు. ఇంకిపోయింది. ఏడవడానికి శక్తి కూడా లేదు. రాఘవ నీకు తమ్ముడు వాడిమీద కూడా నాకు నమ్మకం లేదు. ఎప్పటికైనా మమ్మల్ని మోసం చేస్తాడేమోనన్న అనుమానంవుంది. దానికి తగ్గ కారణాలున్నాయి. ఇప్పటికే రాఘవని కనిపెట్టలేకుండా వున్నాను. ఇక మీగిటమి ఇద్దర్నీ కనిపెట్టుకుంటూ వుండలేనురా శివా" దుఃఖం చేత శాంతి కొంతసేపు మాట్లాడలేకపోయింది.

శివరావు మౌనంగా కూర్చున్నాడు.

"నేను సంపాదించే తిండి అందరికీ సరిపోవడంలేదు శివా. మేము ఎలా బతుకుతున్నామో అడక్కు. సగం కడుపు నే నింపుకుంటున్నాం అయితే మచ్చవచ్చే పనులేవీ చేయడంలేదు. నా నిస్సహాయతను ఎలా అర్థం చేసుకున్నా నేనేమనుకో..."

అప్పటికి శివరావు "నేనిక్కడే వుండి పోతానని ఎందుకనుకుంటున్నావో అర్థం కావడంలేదు ఉండనని మాట ఇస్తున్నాను సరా?" బింకంగా అన్నాడు.

శాంతి దుఃఖం ఆపుకోలేకపోయింది.

"రేపొద్దున సూర్యుడొచ్చే వేళకి ఈ ఊర్లో ఉండనని మాట ఇస్తున్నాను" అన్నాడు మళ్ళీ

"అన్నిటికీ ఒక్క ఏడుపు ఏడిచి ఊరుకుంటాను" అంది. దుఃఖంలోనే, శాంతి.

రాఘవ వచ్చాడు. శాంతి శివరావును చూపెడుతూ అంది "అన్నయ్యొచ్చాడు."

"వాసా?

"కాదు శివ"

"నాసనుకున్నాను". కనీసం శివరావుని చూసేందుకైనా ప్రయత్నించలేదు. చాప తీసుకుని వంటింట్లోకి వెళ్ళి పరచుకున్నాడు. ఈ ప్రపంచంతో సంబంధం లేనట్లుగా అడ్డంగా పడుకున్నాడు మరి కాసేపటికి గుర్రు వినిపించింది.

"బాగా పొడుగెదిగిపోయాడు" అన్నాడు శివరావు రాఘవని ఉద్దేశించి

"వాడొచ్చేడంటే మూడున్నర గంటలయి వుంటుంది" అంది శాంతి సమాధానంగా.

"ఉదయం రైలు ఎన్ని గంటలకొస్తుంది. ఐదు గంటలకేనా?" అన్నాడు శివరావు.

"రైలుకన్నా బస్సేముందు బయల్దేరుతుంది" అంది శాంతి.

శివరావు రెండు నిమిషాలు అక్క మొహంలోకి చూశాడు. "అయితే నేను వెళ్తాను" లేచాడు

శాంతి వుండిపొమ్మని బలవంతం చెయ్యలేదు. "ఇంకాస్సేపు" వుండమంది.

శివరావు 'హుఁ' అనిమాత్రం అన్నాడు.

వర్షం నిలిచిపోయింది. ఈదురుగాలి హోరు ఇంకా తగ్గలేదు.

"రోజూ రాత్రి నాకు నిద్ర ఉండదు. మీరిద్దరూ మాకో దారి చూపెట్టకుండా మీకు నచ్చిన మార్గాలు ఎన్నుకున్నారు. రాఘవ కూడా మీ దారే అనుసరించడన్న నమ్మకమేముంది? ఒక్కొక్కసారి వాడి మాటలూ చేతలూ చూస్తే మాకీ బతుకు కూడా బతికించే యోగ్యత లేకుండా చేస్తాడేమోనని పిస్తుంది. వాడు ఇంట్లో ఉన్నంతసేపూ నాకు నిద్ర ఉండదు. మేలుకునే ఉంటాను. వాడు లేనప్పుడే నాకు నిద్ర"

శివరావుకి కొంచెం కొంచంగా అర్థమవుతోంది.

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!
హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యంచేయబడును.
వరిబీజము (బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ- రండి.
డా॥ దేవర, ఫోన్ 551, మార్వాడి గుడి వద్ద, తెనాలి.
SUVARNA
బ్రాంచి: 26, నాం. బోగ రోడ్ మద్రాసు-17

"రోజూ రాత్రి రాఘవ వచ్చేసరకై నా నిద్రపోతాను. ఈ రాత్రి నాకసలు నిద్ర లేదు ఎందుకో తెలుసా శివా? కారణం చెప్తే [illegible]పగించుకోవూ? మనుషుల్ని మనుషులే పీక్కుతినే రోజులివి. ఈ పెట్టెలో నా ఆరో ప్రాణం వుంది."

"తెలుసక్కా. చెప్పకు. నా మీద నీకు ఎంత అసహ్యముందో బోధపడుతోంది." అతని కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. ఇల్లంతా ఒకసారి పరికించి చూశాడు. అందరూ ఆదమరిచి నిద్రపోతున్నారు.

"వస్తాను" అన్నాడు. తలుపు తీసుకుని చీకట్లో కలిసిపోతున్న శివరావును చూస్తూ వెర్రిదానిలా నిల్చుంది శాంతి. ★


# చర్మవ్యాధులకు



## అతి గాఢంగా పనిచేసే అమృతాంజన్ డెర్మల్ ఆయింట్‌మెంట్

చర్మవ్యాధులకు ఉపయోగపడే సాధారణ ఆయింట్‌మెంట్లు ఎక్కువగా చర్మం లోపలకు ప్రవేశించలేవు. కాని అమోఘమైన చర్మరోగ నివారణ ఔషధాలు విశిష్టంగా చేరివుండటంచేత అమృతాంజన్ డెర్మల్ ఆయింట్‌మెంటు మాత్రమే లోపలకు ప్రవేశిస్తుంది. సాధారణ చర్మవ్యాధులను అతి శీఘ్రంగా నిర్మూలించి చర్మాన్ని పూర్వస్థితికి తెచ్చి సహజంగాను ఆరోగ్యవంతంగాను ఉంచుతుంది.

అమృతాంజన్-డెర్మల్ ఆయింట్‌మెంట్ తామర, గజ్జి, దురద ఇతర చర్మ రోగాలకు ఆదర్శమైన నివారిణి.

నేడే ఒకటి కొనండి!




**అమృతాంజన్ లిమిటెడ్** 14/15 లజ్ చర్చిరోడ్డు మద్రాసు 600 00

SAA/AM/1906 RI TEL